సాక్షి జగిత్యాల

బుధవారం, 2, ఆగస్టు, 2023



అంజన్నకు పూజలు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.



వైభవంగా సత్సంగం

జగిత్యాలటౌన్: శ్రీలక్ష్మీగణేశ్ మందిరంలో ఆస్థాన పౌరాణికుడు బాచంపల్లి సంతోష్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో సత్సంగం జరిగింది.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాలజోన్: వానాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఈక్రమంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సూచించారు. జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షించారు. మురుగునీటి నిల్వలు తొలగించాలని, ఎల్‌పీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో పారిశుధ్య పనులు మెరుగుపర్చుకోవాలని కోరారు. పల్లెప్రకృతి వనాలు, మంకీ ఫుడ్‌కోర్టుల్లో సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడంపై దృష్టి చేపట్టాలని అన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశ వర్కర్లకు సూచించారు. జెడ్పీ సీఈవో రామానుజాచార్యులు, డీపీవో దేవరాజ్, డీఎంహెచ్‌వో శ్రీధర్ పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకుంటాం



ఇసుక మేటలు పరిశీలిస్తున్న సంజయ్

జగిత్యాలరూరల్: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అభయం ఇచ్చారు. అంతర్గాం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న వాగుకట్టలు, రోడ్లు, పంటలు, పొలాల్లో వేసిన ఇసుక మేటలను ఆయన మంగళవారం పరిశీలించారు. వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశించారు. రోడ్లు, కట్టలకు తాత్కాలిక మరమ్మతు యుద్ధప్రతిపాదికన చేపట్టాలని సూచించారు. రాయికల్‌లో 180 శాతం, జగిత్యాలలో 102శాతం, సారంగాపూర్‌లో 33శాతం, బీర్‌పూర్‌లో 35 శాతం అధిక వర్షాలు కురిశాయని ఆయన తెలిపారు. రైతుబంధు మండల కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, సర్పంచ్ నారాయణ, ఎంపీటీసీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డి, నాయకులు స్వామిరెడ్డి, రాజిరెడ్డి, గంగాధర్, శ్రీనివాస్, మల్లేశం, శంకర్ పాల్గొన్నారు.

క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

కోరుట్ల: డీఎస్సీ– 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ మాదిరిగా తెలంగాణలో కూడా న్యాయం చేయాలని డీఎస్సీ–1998 క్వాలిఫైడ్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం కేసీఆర్ 2016 జనవరిలో డీఎస్సీ క్వాలిఫైడ్ ప్రతినిధులతో చర్చలు జరిపిన సమయంలో మానవతాదృక్పథంతో వయోపరిమితితో సంబంధం లేకుండా ప్రత్యేక కేసుగా గుర్తించి ఉద్యోగాలిస్తామని భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

మెట్‌పల్లి ఆర్డీవోగా మధు

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లి ఆర్డీవోగా దూలం మధు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. అనంతరం మెట్‌పల్లికి బదిలీ చేసింది. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయనకు మెట్‌పల్లి తహసీల్దార్ సత్యనారాయణతోపాటు పలువురు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ



అనిల్‌బాబు

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా అనిల్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ కార్పొరేషన్‌లో పనిచేసిన ఆయన పదోన్నతిపై జిల్లాకు బదిలీ అయ్యారు. ఇప్పటిదాకా వెటర్నరీ అధికారి నరేశ్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగారు.

ఇన్‌చార్జి డీపీఆర్వోగా దశరథం

జగిత్యాల: జగిత్యాల ఇన్‌చార్జి డీపీఆర్వోగా దశరథం నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డీపీఆర్వో భీంకుమార్ వ్యక్తిగత సెలవులపై వెళ్లారు. రాజన్న సిరిసిల్ల జిల్లా డీపీఆర్వోగా పనిచేస్తున్న దశరథం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. ఈమేరకు ఆయనకు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర శాఖ డైరెక్టర్ రాజమౌళి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

నష్టం కోటిన్నర పైనే..

కథలాపూర్(వేములవాడ): జిల్లాలో ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో ట్రాన్స్‌కోకు తీవ్రనష్టం వాటిల్లింది. వాగులు పొంగడం, చెరువులు మత్తళ్లు దూకి రోడ్లపైకి వరద రావడం, కల్వర్టులు ఉధృతంగా పారడంతో రహదారులు కోతకు గురయ్యాయి. వాటి సమీపంలోని విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. తీగలు తెగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. మరికొన్ని నీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. రోజుల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ట్రాన్స్‌కో అధికారులు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టడంతో జిల్లావాసులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ, సంస్థకు సుమారు రూ.1.50కోట్ల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

- విరిగిన విద్యుత్ స్తంభాలు
- తెగిన కరెంట్ తీగలు
- ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు
- భారీవర్షాలు తెచ్చిన తంటాలు
- పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైన సిబ్బంది, అధికారులు



కథలాపూర్ మండలం బొమ్మెన శివారులో వరద ఉధృతికి ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్



బొమ్మెనవాగులో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు



భూషణరావుపేట శివారులో విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది, రైతులు

నష్టం అపారం..

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలు, 380 గ్రామాలు ఉన్నాయి.
- గత బుధ, గురు, శుక్రవారాల్లో జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిశాయి.
- వర్షాలు, వరదల ధాటికి జిల్లావ్యాప్తంగా 1,143 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.
- 89 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వరదనీటిలో మునిగిపోయాయని, ఇందులో కొన్ని ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు.
- అత్యధికంగా కథలాపూర్ మండలంలో 17 ట్రాన్స్‌ఫార్మర్లు, కోరుట్ల మండలంలో 16 ట్రాన్స్‌ఫార్మర్లు, రాయికల్ మండలంలో 15 ట్రాన్స్‌ఫార్మర్లకు నష్టం వాటిల్లింది.
- గొల్లపల్లి మండలంలో అత్యధికంగా 196 విద్యుత్ స్తంభాలు, కోరుట్ల మండలంలో 193 స్తంభాలు కుప్పకూలాయి.
- మొత్తంగా భారీ వర్షాలకు ట్రాన్స్‌కోకు సుమారు రూ.1.50 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.
- విద్యుత్ స్తంభాలు జిల్లాలోనే అందుబాటులో ఉండగా.. ట్రాన్స్‌ఫార్మర్లు ఇతర జిల్లాల నుంచి తెప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు.
- గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉండవద్దనే ఉద్దేశంతో అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు.



కథలాపూర్ మండలం దూలూర్ శివారులో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

వేగవంతంగా మరమ్మతులు



భారీ వర్షాలతో జిల్లావ్యాప్తంగా ట్రాన్స్‌కోకు సుమారు రూ.1.50 కోట్ల నష్టం వాటిల్లింది. ఆయా గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, విద్యుత్ తీగలు పరిశీలించి నివేదిక తయారు చేశాం. గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందిలేకుండా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాం. వ్యవసాయ రంగానికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు తెప్పించి వీలైనంతా త్వరగా విద్యుత్ తీగలు బిగించి కరెంట్ సరఫరాను పునరుద్ధరిస్తాం. మాతో ప్రజలు సహకరించాలి.

– సత్యనారాయణ, ఎస్ఈ, ట్రాన్స్‌కో

వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదు



మాట్లాడుతున్న తెలంగాణ మలిదశ ఉద్యమకారులు

- వినోద్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు జరిపితే మాపై సస్పెన్షనా?
- కేటీఆర్ జన్మదిన వేడుకలు జరిపిన వారిని ఎందుకు ఉపేక్షించారు?
- ఎమ్మెల్యే రమేశ్‌బాబును ప్రశ్నించిన మలిదశ తెలంగాణ ఉద్యమకారులు

కథలాపూర్(వేములవాడ): 'మేడిపెల్లిలో అప్పటి ఎంపీ వినోద్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు జరిపితే మమ్మల్నీ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు సరే.. ఇటీవల నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ వేడుకలు చేసిన నాయకులను ఎందుకు సస్పెండ్ చేయలేదు.. వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాకు సమాధానం చెప్పాలి' అని తెలంగాణ మలిదశ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. మంగళవారం మేడిపెల్లి మండల కేంద్రంలో నియోజకవర్గానికి చెందిన మలిదశ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రమేశ్‌బాబు నివాసానికి సమీపంలోనే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం మరోనేత ఏర్పాటు చేస్తే.. పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. మరో బీఆర్ఎస్ నియోజకవర్గ నేత మేడిపెల్లి మండలం కొండాపూర్‌లో మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలన్నారు. వారిద్దరినీ బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసే ధైర్యం లేకుంటే ఎమ్మెల్యే రమేశ్‌బాబు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వేములవాడ మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్‌గౌడ్, నాయకులు చిలుక పెంటయ్య, బొంగొని రాజాగౌడ్, ఎండీ ఇక్బాల్, మేడిపెల్లి గంగాధర్, వాకిటి రాజారెడ్డి, బాలసాని మారుతి, రాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఎస్పీ భాస్కర్



బహుమతులు అందజేస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. మంగళవారం స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని పోలీస్ సేఫర్ ఇండియన్ రోడ్డు, ఇండియన్ యూత్ సెక్యూర్ ఆర్గనైజేషన్ సంస్థల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. నియమాలు పాటించిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలు పాటించడం బాధ్యతగా తీసుకున్నప్పుడే ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందన్నారు. వేగం కన్నా ప్రాణం ముఖ్యమని, వేగంగా వెళ్తే రెండు నిమిషాలు ముందు చేరుకోగలం కానీ, ఏదైనా ప్రమాదం జరిగితే నిండు ప్రాణం బలి అవుతుందని అన్నారు. ఎక్కువమంది యువత రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారని తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడపకూడదని సూచించారు. అనంతరం హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నియమాలు పాటించి, సరైన పద్ధతిలో వెళ్లే వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటస్వామి, రవీంద్రరెడ్డి, టౌన్ సీఐ నటేశ్, ఇన్‌స్పెక్టర్ రఫీఖాన్, ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం, ఆర్ఎస్సై కృష్ణ, సేఫర్ ఇండియన్ రోడ్డు, ఇండియన్ యూత్ ఆర్గనైజేషన్ బృందం తదితరులు పాల్గొన్నారు.



మేం విధులు బహిష్కరిస్తే.. మీరు పనిచేస్తారా?

వెల్గటూర్(ధర్మపురి): సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో తాము 27రోజులుగా సమ్మె చేస్తున్నామని, తమను కాదని ప్రైవేట్ వ్యక్తులతో చెత్త ఎలా తొలగిస్తారని ముత్తునూర్, ఎండపల్లి మండలం కొత్తపేటలో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు ప్రశ్నించారు. కార్మికుల సమ్మెతో చెత్త పేరుకుపోయింది. ప్రైవేట్ వ్యక్తులతో చెత్త తొలగించేందుకు సర్పంచులు ప్రయత్నించగా.. పారిశుధ్య కార్మికులు ట్రాక్టర్లకు ఇలా అడ్డుకుని నిరసన తెలిపారు.

బీఆర్ఎస్ తిరుగులేని రాజకీయశక్తి



యువకులకు కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- కాంగ్రెస్, బీజేపీలు ప్రజావిశ్వాసం కోల్పోయాయి
- మరోసారి గులాబీ పార్టీదే అధికారం
- మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్(ధర్మపురి): తెలంగాణలో బీఆర్ఎస్ తిరుగులేని రాజకీయశక్తిగా ఎదిగిందని సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామం లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో గుల్లకోట, చెర్లపల్లి గ్రామాల్లోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 150 మంది కార్యకర్తలు మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం గత 9 ఏళ్లగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని అన్నారు. రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా నిలుపుతోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చూసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని తెలిపారు. బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే శక్తిలేని ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని, అందుకే కాంగ్రెస్, బీజేపీల నుంచి భారీస్థాయిలో కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, ఎండపల్లి, రాజారాంపల్లి సర్పంచులు మారం జలేందర్ రెడ్డి, గెల్లు శేఖర్, ఎండపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఆర్టీసీ కార్మికుల క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

జగిత్యాలటౌన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్న రాష్ట్ర కేబినేట్ ప్రతిపాదనపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో సీఎం కేసీఆర్, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు వారు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటనర్సప్పతోపాటు కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో..

కోరుట్ల : స్థానిక ఆర్టీసీ డిపోలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి కార్మికులు క్షీరాభిషేకం చేశారు. టాపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగరరావును కలిసి శాలువాతో సత్కరించారు. డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి, తిరుపతి, జీపీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాచరిక పాలన

- ఆర్టీసీ విలీనాన్ని స్వాగతిస్తున్నాం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో రాచరిక పాలన సాగుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఇందిరాభవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. విలీన ప్రక్రియ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాలని కోరారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాల ఉత్పత్తిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతీ లీటర్‌పై రైతులకు రూ.4 నగదు ప్రోత్సాహం అమలు చేస్తామన్న ప్రభుత్వ హామీ నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్ డెయిరీ ఆస్తులన్నీ ప్రభుత్వ ఆస్తులేనని గుర్తుచేశారు. విజయ డెయిరీ పేరుతో ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్నప్పుడు సంస్థ అభివృద్ధి కోసం రూ.కోట్ల విలువైన ఆస్తులను ప్రభుత్వం కేటాయించిందని గుర్తుచేశారు. దానిని కరీంనగర్ డెయిరీగా మార్చుకున్న సంస్థ యాజమాన్యం.. ప్రభుత్వం కేటాయించిన ఆస్తులన్నింటినీ తన సొంత ఆస్తులుగా మార్చుకున్నదని ఆరోపించారు. డెయిరీ యాజమాన్యానికి తమ ఆస్తుల పెంపుపై ఉన్న శ్రద్ధ రైతుల సంక్షేమంపై లేకపోవడం విచారకరమన్నారు. నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజంగి నందయ్య, గాజుల రాజేందర్, చందా రాధాకిషన్, ధర రమేశ్, జున్ను రాజేందర్, గుండ మధు, చాంద్‌పాషా ఉన్నారు.



తరగతి గదులను పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

వసతుల లేమిపై ఆగ్రహం

రాయికల్(జగిత్యాల): ఇటీవల కురిసిన వర్షాలతో ఇటిక్యాల మోడల్ స్కూల్ తరగతి గదుల్లోకి వర్షపునీరు వచ్చి చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, అయినా పట్టించుకునే నాథుడే లేడని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈవో పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. తరగతి గదులు చెత్తాచెదారంతో నిండి ఉండటంతో డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. యుద్ధప్రతిపాదికన తరగతి గదులను శుభ్రం చేయించి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం కొత్తపేట, మూటపల్లి, వంతెనను పరిశీలించారు. నాయకులు కాటిపల్లి గంగారెడ్డి, రవీందర్‌రావు, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

శాలసిద్ధితో పాఠశాలల అభివృద్ధి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

- డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: శాలసిద్ధి ద్వారా పాఠశాలల అభివృద్ధిపై సమగ్ర సమాచారం నమోదు చేయాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన శాలసిద్ధి ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలో 15 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 11 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి రెండు రోజులుగా శాలసిద్ధి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో పాఠశాలల వివరాలను నమోదు చేయడం ద్వారా సమగ్ర మూల్యాంకన విధానం తెలిసిపోతుందని, తద్వారా ఆ పాఠశాలల వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చి అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం కొత్త మార్పులతో వందశాతం శాలసిద్ధి నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందని చెప్పారు. పాఠశాలల్లో అవసరమైన వసతుల కల్పన, నిధుల మంజూరుకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్, అడ్మినిస్ట్రేషన్ ద్వారా శాలసిద్ధి వెబ్‌సైట్ ప్రారంభించిందని వివరించారు. ఇది విజయవంతమైతే జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ ప్రక్రియ అమలు కానుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా ఏడు కేటగిరీల్లో ఈ వివరాలు పొందుపరుస్తారని చెప్పారు. ఇందులో వనరులు, అవసరాల వినియోగం, బోధన, అభ్యాసన, మదింపు, విద్యార్థుల ప్రగతి, వారి సాధన, పాఠశాల నాయకత్వం, సమ్మిళిత విద్య, ఆరోగ్యం అంశాలు నమోదు చేయాలని అన్నారు. ఒక్క క్లిక్‌తో విషయాలన్నీ తెలుస్తాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ అధికారి కొక్కుల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్ స్కూల్' విద్యార్థులకు వరం

ఓపెన్ స్కూల్ విద్యావిధానం విద్యార్థులకు వరమని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో తెలంగాణ ఓపెన్ స్కూల్ క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు ఎవరైనా ఈ ఓపెన్ స్కూల్‌లో చేరాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, ప్రతినిధులు శ్యామ్, అనుపమ, సత్యనారాయణ, రాజేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన అనిల్‌బాబు


కలెక్టర్‌తో కమిషనర్ అనిల్‌బాబు

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనిల్‌బాబు మంగళవారం కలెక్టర్ యాస్మిన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్‌లో పనిచేస్తున్న అనిల్‌బాబు పదోన్నతిపై జగిత్యాలకు బదిలీపై వచ్చారు. అదనపు కలెక్టర్ దివాకర, లతను కూడా ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వడం హర్షణీయం

కోరుట్ల: బీడీ కార్మికులతోపాటు పరిశ్రమలో పనిచేసే వారందరికీ జీవనభృతి వర్తింపజేసేందుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడం ఆశించదగ్గ పరిణామమని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింత భూమేశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన కోరుట్లలో విలేకరులతో మాట్లాడారు. ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ బీడీ పరిశ్రమలో పనిచేసే చెక్కర్స్, కమీషన్ ఏజంట్లు, ప్యాకింగ్ కార్మికులకు జీవనభృతి కల్పించాలని కోరుతూ చేసిన పోరాటాలకు ఫలితం దక్కిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి సామల్ల గంగాధర్, నాయకులు రహీం, బాలయ్య, కలీం, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎమ్మార్ చెల్లించాలి

జగిత్యాల: రైస్‌మిల్లర్లు నిర్దేశిత సీఎమ్మార్ చెల్లింపుల లక్ష్యాలను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లత సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రైస్‌మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు ఉన్నారు.

బోర్నపల్లిలో వృద్ధురాలిపై కుక్కల దాడి


చికిత్స చేస్తున్న డాక్టర్ రమేశ్

రాయికల్(జగిత్యాల): బోర్నపల్లి గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న రాంబాయిపై మంగళవారం వీధిజ కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమేశారు. గాయపడ్డ మహిళను ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రాథమిక వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ రమేశ్.. పరిస్థితి విషమంగా ఉందని జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

మళ్లీ రోడ్డెక్కిన లంబాడీలు

- విగ్రహాల ధ్వంసంపై పెల్లుబికిన ఆగ్రహం
- పాతబస్టాండ్ వద్ద బంజారా గిరిజనుల ధర్నా
- సంఘీభావం ప్రకటించిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు


భరతమాత కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించిన లంబాడీలు

మల్లాపూర్(కోరుట్ల): తమ ఆరాధ్య దైవమైన శీత్లాభవాని మాతా విగ్రహాలను ధ్వంసం చేసి పూడ్చిన ఘటనపై లంబాడీలు మళ్లీ రోడ్డెక్కారు. మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద మంగళవారం రోడ్డుపై బైఠాయించారు. దుండగులపై కేసు నమోదు చేయడంలో జాప్యం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లాపూర్ శివారు బోడగుట్ట సమీపంలో గతనెల 18న శీత్లాభవాని విగ్రహాలను ప్రతిష్ఠించి పండుగ జరుపుకున్నామని తెలిపారు. తమ తండాకు చెందిన గుగ్లావత్ దేవేందర్ శీత్లాభవాని మాతను దర్శించుకునేందుకు వెళ్లగా.. దేవతా విగ్రహాలు కూల్చివేసి కనిపించాయని మండిపడ్డారు. ఇందుకు బాధ్యులైన మొగిలిపేట గ్రామస్తులను ఫోన్ ద్వారా ప్రశ్నిస్తే.. దురుసుగా సమాధానం ఇచ్చారని, తమ దేవతలను, తమ జాతిని కించపరిచారని ఆవేదన చెందారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని బంజారాలు డిమాండ్ చేశారు. ధర్నాకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్‌తోపాటు ఆయా పార్టీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తండావాసులతో మాట్లాడి కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గిరిజనులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గుగ్లావత్ రాజేందర్, దేవేందర్, తేజ, ఇస్లావత్ రాజేశ్, తిరుపతి, శ్రీనివాస్, మురళి, శేఖర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు

బోడగుట్ట సమీపంలో ప్రతిష్ఠించిన శీత్లాభవాని విగ్రహాల ధ్వంసం ఘటనలో ముగ్గురు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. మొగిలిపేట గ్రామానికి చెందిన దండవేణి రాజేందర్, సంగెం–శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన దేవర సురేశ్‌రావు, ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన పెండ్యాల చిన్నసాయన్న తమ భూమిని చదును చేసే క్రమంలో విగ్రహాలు ధ్వంసం చేశారని బంజారా తండాకు చెందిన భూక్య తేజు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వస్త్రవ్యాపారంలో నష్టాలు

- మనస్తాపంతో వ్యాపారి ఆత్మహత్య


నరహరి (ఫైల్)


నరహరి రాసిన సూసైడ్ నోట్

జగిత్యాలక్రైం: వస్త్రవ్యాపారంలో నష్టాలు రావడం, పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మనస్తాపం చెందిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన హోల్‌సేల్ వ్యాపారి గాజుల నరహరి(55) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నరహరి పట్టణంలో హోల్‌సేల్ వ్యాపారి. దందా బాగా సాగేందుకు బ్యాంకులో కొంత రుణం తీసుకున్నాడు. తెలిసిన వాళ్ల వద్ద మరికొంత అప్పు చేశాడు. అయితే, వ్యాపారంలో ఆశించిన లాభాలు రాకపోవడం, తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం, వాటిని తీర్చేదారిలేకపోవడంతో ఆయన తీవ్రమనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఉదయం పట్టణంలోని జగిత్యాల క్లబ్‌కు వెళ్లాడు. ఇంటినుంచి తెచ్చుకున్న తాడును సీలింగ్ ఫ్యాన్‌కు కట్టి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులకు వడ్డీ కట్టలేక, ఆర్థిక ఇబ్బందులు వెంటాడడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని, తనను క్షమించండని రాసిన లేఖ మృతుడి జేబులో లభించింది. కాగా, క్లబ్ స్వీపర్ గదులు శుభ్రం చేస్తుండగా నరహరి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో ఆయన కుటుంబసభ్యులతోపాటు, జగిత్యాల క్లబ్ సెక్రటరీ నారాయణరెడ్డికి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ నటేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సచిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య ఉంది. కూతురు అమెరికాలో ఉంటోంది. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు జాప్యమయ్యే అవకాశం ఉంది.

భర్త ఆచూకీ కోసం ఫిర్యాదు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామానికి చెందిన తన భర్త ఆచూకీ లభించడం లేదని భార్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై గౌతంపవార్ కథనం ప్రకారం.. మహేశ్ అనే యువకుడు గతనెల 9న ధర్మపురి మండలం నక్కలపేట గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పాడు. బయటకు వెళ్లి ఇప్పటి వరకూ తిరిగి రాలేదు. మహేశ్ ఆచూకీ కోసం బంధువులు, తెలిసినవాళ్ల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేదు. దీంతో భార్య రాజమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మందులు అడిగితే దుర్భాషలాడారు


వైద్య సిబ్బందిని నిలదీస్తున్న మహిళలు

- ఫార్మసిస్ట్ తీరుపై పేషెంట్ల ఆగ్రహం

మల్లాపూర్(కోరుట్ల): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుగోళీలు, కాటన్, బ్యాండేజీ అడిగిన పేషెంట్లను ఫార్మసిస్ట్ దుర్భాషాలాడారు. మంగళవారం ఈఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. కుస్తాపూర్ గ్రామానికి చెందిన సరోజన, ఒబులాపూర్ గ్రామానికి చెందిన మరో మహిళ స్థానిక పీహెచ్‌సీకి వైద్యం కోసం వెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం ఫార్మసిస్ట్ సైఫొద్దీన్ వద్దకి వెళ్లి షుగర్, బీపీ ట్యాబెట్లు, కాటన్, బ్యాండేజీ, హైడ్రోజన్ పెరాక్సైడ్ ఇవ్వాలని అడిగారు. అవేమీ లేవంటూ దురుసుగా సమాధానమిచ్చాడు. ఆస్పత్రిలో మందులు లేకపోతే ఆర్డర్ ఎందుకు పెట్టడం లేదని పేషెంట్లు నిలదీశారు. ఈక్రమంలో ఫార్మసిస్టుకు మద్దతుగా వైద్యాధికారి, సిబ్బంది మహిళలతో వాగ్వాదానికి దిగారు. పేషెంట్లతో దురుసుగా వ్యవహరిస్తున్న ఫార్మసిస్ట్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. పీహెచ్‌సీ మెడికల్ అధికారి వాహినిని వివరణ అడుగగా సదరు మహిళలను పరీక్షించి మందులు రాసి ఇచ్చామన్నారు. అయితే, ఆ మందులనే ఫార్మసిస్టు వారికి ఇచ్చారని తెలిపారు. కానీ, ఆ మహిళలు మరికొన్ని మందులు ఇంటికి తీసుకెళ్లేందుకు ఇవ్వాలని అడిగితే ఇవ్వకపోవడంతోనే గొడవ చేశారని తెలిపారు. ఫార్మసిస్ట్ పేషెంట్లతో దురుసుగా ప్రవర్తించలేదని వివరించారు.

సిరిసిల్లలో బాలుడిపై వీధికుక్క దాడి


గాయపడ్డ ఆసిన్

సిరిసిల్లటౌన్: వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఓ బాలుడిపై ఐదు నెలల్లో రెండోసారి దాడి చేశాయి. జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌కు చెందిన ఎండీ ఆసిన్(5) మంగళవారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికొచ్చి స్కూల్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో అటువైపు వచ్చిన కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. కుక్కల దాడితో బాలుడి ముఖం, చేతులపై గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరిమేయడంతో ప్రాణాపాయం తప్పింది. తీవ్రంగా గాయపడ్డ ఆసిన్‌కు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. గత మార్చి 17న ఇదే బాలుడు ఇంటిముందు ఆడుకుంటుండగా కుక్కల మంద దాడి చేసింది. ఆ సంఘటన నుంచి బాలుడు తేరుకుంటున్న సమయంలో మళ్లీ దాడిచేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కలను నివారించాలని కోరుతున్నారు.

బీడీ టేకేదారు, కార్మికులకు అండ

జగిత్యాల: బీడీకార్మికులకు, బీడీ టేకేదారులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీడీటేకుదారులకు జీవనభృతి ఇస్తున్నట్లు రాష్ట్ర కేబినేట్ సమావేశంలో నిర్ణయించడంతో టేకేదారులు ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్ చిత్రపటాలకు తహసీల్‌చౌరస్తాలో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు

- డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ

జగిత్యాలరూరల్: మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయని డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక యూబీఐలో మంగళవారం జరిగిన సీబీఆర్ఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలకు ప్రతీసంవత్సరం బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నామన్నారు. ఇందులో బ్యాంకు అధికారుల కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను వాయిదా పద్ధతుల్లో సకాలంలో చెల్లించి లక్ష్యం పూర్తిచేయాలని కోరారు. అనంతరం లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ప్రతీబ్యాంకు ద్వారా విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఒక్కో మహిళా సంఘానికి రూ.20 లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇస్తున్నామని ఆయన చెప్పారు. రుణాలను సద్వినియోగం చేసుకుని మంచి యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సరళ్‌గుప్తా, ఫీల్డ్ ఆఫీసర్లు సుభాష్, మధుసూదన్, ఏపీఎం గంగాధర్, టీఎంసీ రజిత, సీసీలు సంతోష్, రాధ, రవీందర్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి


ఘటన స్థలంలో భూమమ్మ

మంథని: మంథని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముత్తుగారి భూమమ్మ(90) మంగళవారం లారీ ఢీకొని మృతిచెందినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఇసుక క్వారీ ర్యాంపు నిర్మాణానికి మట్టిని చేర్చి మంథని వైపు వెళ్తున్న లారీ, రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న భూమమ్మను ఢీకొట్టింది. రెండు కాళ్ల మీదుగా లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. మంథనిలో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ తరలించగా, చికిత్స పొందతూ మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

జగిత్యాల: అర్హులందరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడానికి రాజకీయ పార్టీల ప్రతిని ధులు సహకరించాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా కోరా రు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల ఎన్నికల కార్యక్రమాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

వైద్యం కోసం వస్తూ.. అస్వస్థతకు గురై..

పెద్దపల్లిరూరల్: బస్సులో ప్రయాణిస్తూ మార్గమధ్యలో అస్వస్థతకు గురైన పుల్గం అక్కు (62)ను పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా కొద్దిసేపటికే మరణించింది. అక్కు కుమారుడు సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా, మండలంలోని రాపల్లికి చెందిన పుల్గం అక్కు శరీరంపై ఏర్పడ్డ కురుపులకు చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో కొంత కాలంగా చికిత్స పొందుతోంది. మంగళవారం వైద్య సేవలకోసం ఆసిఫాబాద్ నుంచి కరీంనగర్ ఆసుపత్రికి బస్సులో బయల్దేరారు. మార్గమధ్యలో అస్వస్థతకు గురికావడంతో పెద్దపల్లి పట్టణంలో బస్సును ఆపగా, ట్రాఫిక్ కానిస్టేబుల్ శంకర్ సహకారంతో ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తుండగానే అక్కు కన్నుమూసింది.

మధ్యంతర భృతి ప్రకటించాలి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి


సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

జగిత్యాల: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. పలు పాఠశాలల్లో మంగళవారం సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, వర్క్ సర్దుబాటు చేసి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పీఆర్సీ కమిషన్ వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్ సాధించేంత వరకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యరాజ్, మచ్చ రాజశేఖర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ధర్మపురి: ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టి మాట్లాడారు. బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని, పీఆర్సీ కమిషన్ వేసి మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. నాయకులు కొలిచాల సత్యరాజ్, మచ్చ రాజశేఖర్, రాజేందర్‌రెడ్డి, దత్తాత్రి, కస్తూరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన రైతు సంఘం నాయకులు


కోర్టు ఎదుట రైతు నాయకులు

జగిత్యాలజోన్: జిల్లాలో 2018 సంవత్సరంలో ఎస్సారెస్పీ నీరు వదలాలని జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైతులు శాంతియుతంగా ఆందోళన చేశారు. ఈక్రమంలో 15 మంది నాయకులపై పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి మంగళవారం రైతు సంఘం నాయకులు జగిత్యాల కోర్టుకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, పొలాలు ఎండిపోతున్న తరుణంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులు, రైతు నాయకులపై కక్ష సాధింపు చర్యలతోనే కేసులు నమోదు చేశారన్నారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని వారు కోరారు. కోర్టుకు హాజరైన వారిలో రైతు ఉద్యమ నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి తోపాటు, మరో 14 మంది రైతు నాయకులు ఉన్నారు.